ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
5

అనంతపురం
జిల్లా వార్తలు
సోమవారం 5 ఆగస్టు 2024

ఎటుపోతోంది సమాజం?

పసిపిల్లలపై లైంగిక దాడులు

ఎటుపోతోంది సమాజం? ఉచ్చ, నీచాలు, వావివరుసలు లేని పాతరాతి యుగంలా రగులుతోందా? ఆదిశక్తిని కొలిచే ఈ సమాజమే ఆడబిడ్డను ఆటబొమ్మగా చూస్తోందా? బేటీ అంటే ఇంటికి బ్యూటీ అంటారు కదా..! మరి ఆ అందాన్ని ఆరాధిస్తున్నారా లేక అంతులేని కామ వాంఛతో చిదిమేస్తున్నారా? భగవంతుడిచ్చిన అవయవముంటే చాలు పడుచు పిల్ల , పండు ముసలి అన్న తేడా లేదు. పాలుగారే పసిపాప అయినా పర్వాలేదు. అంతులేని 'కోరిక'తో అకృత్యాలకు తెగబడుతున్నారు. మగ పుట్టుక పుడితే చాలు... ఆడేపాడే వయసు నుంచి కాటికి కాలు చాచే వయసులో కూడా కోరికలతో కాటేస్తున్నారు. ఎక్కడుంది లోపం? ఇంటిలోనా? సమాజంలోనా లేక పాఠాలు చెప్పే బడిలోనా? ఆడబిడ్డలపై అఘాయిత్యాలకు అంతం ఎప్పుడో?

- బంగారు బాల్యాన్ని చిదిమేస్తున్న దుండగులు
- ఇంటా, బయటా పెరిగిన అఘాయిత్యాలు
- వావి వరుసలు మరిచి దారుణాలు
- బాలికలపై పెరిగిన అత్యాచారాలు, హత్యాచారాలు
- కఠిన చట్టాలు తెచ్చినా... కానరాని మార్పు
- దురాగతాలకు అంతం ఎప్పుడో...?



ఐసీడీఎస్ కార్యాలయం

అనంతపురం విద్య, ఆగస్టు 4: ఇటీవల కాలంలో పసిపాపలపై లైంగికదాడులు పెరిగాయి. బడిలో.. ఆట స్థలాల్లో, అంగడికెళ్లే చోట ఇలా ఏదో ఒక చోట అమ్మాయిలపై లైంగిక దాడులు నిత్యకృత్యంగా మారాయి. ఒక చోట అన్న, మరో చోట నాన్న, ఇంకో చోట..చిన్నాన్న, మరో చోటు హితుడు, ఇంకో దగ్గర స్నేహితుడు.... ఇలా ప్రతి చోట పాత్ర మారుతోందే కానీ.... మనిషి మాత్రం 'అతడే'. అతడి నుంచి నుంచి వేధింపులు మాత్రం ఆగడం లేదు. తియ్యని మాటలు వినిపిస్తాయి. కమ్మని ప్రేమ కనిపిస్తుంది. కానీ సమయం వచ్చినడప్పుడు చీకటిలో దాడులు చేసి బాలికల వెలుగును చిదిమేస్తున్నారు. ఒక ప్రాంతంలో 12 ఏళ్ల బాలుడు, ఇంకో ప్రాంతంలో పాతికేళ్ల యువకుడు, ఇంకో చోట నలభై ఏళ్ల నడి వయస్కుడు, మరోచోట 60 ఏళ్లు దాటిన వృద్ధుడు....ఇలా...అన్నిటా...వయస్సు మారుతోంది కానీ... వేధింపులు ఆగడం లేదు.



బంగారు బాల్యంపై విషం

పాలుగారే పసి ప్రాయాన్ని కొన్ని చీడ పురుగులు చిదిమేస్తున్నాయి. బంగారు బాల్యాన్ని చేదు జ్ఞాపకంగా మిగులుస్తున్నారు. చాలా చోట్ల పిల్లలపై లైంగికంగా దాడులు జరుగుతూనే ఉన్నాయి. పిల్లలు దేనికైనా త్వరగా ఆకర్షితులు అవుతారు. అది చెడు చేస్తుందా..? మంచి చేస్తుందా..? అని ఆలోచించే జ్ఞానం వారికి తక్కువగా ఉంటుంది. ఇదే మృగాళ్లకు అవకాశంగా మారుతోంది. చాలా మంది తినుబండారాలు ఇవ్వడం, ఆట వస్తువులు ఇవ్వడం, లేదా కొనిస్తాని బయటకు తీసుకెళ్లడం వంటివి చేస్తూ....లైంగిక దాడులకు దిగుతున్నారు. ఈ విషయంలో మనవాళ్లా...పక్క వాళ్ల పిల్లలా అన్న విచక్షణ కూడా మరచి...రాక్షస మనస్తత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. అయితే ఇలాంటి సంఘటనలు పిల్లల జీవితంపై తీరని గాయాన్ని చేస్తున్నాయి.


పిల్లల రక్షణకే పోక్సో చట్టం...

లైంగిక నేరాల నుంచి చిన్నారులకు రక్షణ కల్పించే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం పోక్సో చట్టాన్ని తీసుకొచ్చింది. లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ చట్టం (పీఓసీఎస్ఓ-2012)ను 2012 మే 22న భారత పార్లమెంట్ ఆమోదం తెలిపింది. అదే ఏడాది నవంబరు 14 నుంచి పోక్సో యాక్ట్‌ను భారత దేశంలో అమల్లోకి తీసుకొచ్చారు. ఈ చట్టం రాక ముందు.... గోవా చిల్డ్రన్ యాక్ట్ 2003 అనేది తీసుకొచ్చారు. పిల్లలపై లైంగిక వేధింపుల నియంత్రణ తీసుకొచ్చిన మొదటి చట్టం. అదేవిధంగా ఐపీసీ 1860లోని పలు సెక్షన్లు సైతం ఈ తరహా నేరాల నియంత్రణకు దోహదపడుతున్నాయి. ముఖ్యంగా ఐపీసీ 1860లోని సెక్షన్ 375 అత్యాచారం, ఐపీసీ 377 అసహజ నేరం, సెక్షన్ 354 దౌర్జన్యం, మహిళల అణకువకు భంగం కలిగించడం వంటి సెక్షన్లు ఉన్నా...పిల్లలను అలాంటి దాడుల నుంచి రక్షించలేకపోయాని గుర్తించారు. తర్వాత దీనిపై దేశ్యాప్తంగా సమగ్రమైన చట్టాన్ని తేవాలని ప్రభుత్వం గుర్తించింది 2012లో పోక్సో చట్టాన్ని తీసుకొచ్చారు. పిల్లలను శారీరకంగా, మానసికంగా వేధిస్తే నిందితులపై ఈ కేసు నమోదు చేస్తారు. 18 ఏళ్లలోపు పిల్లలందరికీ లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పిస్తుంది. అత్యాచారానికి పాల్పడిన వారిపై కఠిన శిక్షలతోపాటు మరణశిక్ష కూడా విధించే అవకాశం ఉంది. కొందరికి ఈ చట్టం తీవ్రత తెలియడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి.



గత ఐదేళ్లలో 718 కేసులు...

అనంతపురం జిల్లా వ్యాప్తంగా గత ఐదేళ్లలో 718 పోక్సో కేసులు నమోదయ్యాయి. బాల బాలికలపై జిల్లాలో మృగాళ్లు లైంగిక దాడులకు, వేధింపులకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో భారీగా పోక్సో కేసులు నమోదైనట్లు ఐసీడీఎస్ అధికారులు చెబుతున్నారు. 2019లో 84 కేసులు, 2020 ఏడాదిలో 150 కేసులు, 2021లో 167 కేసులు, 2022లో 144 కేసులు, 2023లో 132 కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాదిలో ఇప్పటి వరకూ 41 కేసులు నమోదయ్యాయి. ఐసీడీఎస్, చైల్డ్ లైన్ అధికారులు పలు రకాలుగా ఈ లైంగిక వేధింపుల నియంత్రణకు అనేక చర్యలు తీసుకుంటున్నా..మార్పు రావడం లేదు. దీంతో ఎక్కడో....ఒక చోట....ఈ దాడులు జరుగుతూనే ఉన్నాయి. చిన్నారుల బాల్యాన్ని దెబ్బతీస్తూనే ఉన్నాయి.



నిరంతర పర్యవేక్షణ వ్యవస్థ తేలేరా..?

జిల్లాలో ఐసీడీఎస్, డీసీపీఓ, చైల్డ్ లైన్ వంటి విభాగాలున్నా ఈ నేరాలను అరికట్టడంలో ఆశించిన స్థాయిలో పనిచేయడం లేదన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. బాల్యంలో పసి మనసులు గాయ పడితే...దానిని మాన్పడం ఎవరి తరం కాదు. అందుకే నేరాలు జరక్కుండా చూడాల్సిన బాధ్యత ఉంది. జిల్లాలో కలెక్టర్, ఎస్పీ వంటి ఉన్నతాధికారులతోపాటు చట్టాలు చేసే....శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యులు, శాసన మండలి సభ్యులు, ఇతర మేధావులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు ఇలా ఎందరో ఉన్నారు. వీరంతా సమష్టిగా లైంగిక నేరాల నియంత్రణకు నిరంతరం పర్యవేక్షణ చేసే ఒక వ్యవస్థను తేవాల్సిన బాధ్యత ఉంది. ఆ దిశగా జిల్లా యంత్రాంగం...పాలకులు అడుగులు వేయాల్సిన అవసరం ఉంది. భావితరాల బాల్యానికి భద్రత కల్పించాల్సిన అవసరం, బాధ్యత కూడా ఉంది.

తల్లిదండ్రులు అవగాహన కల్పించాలి



లైంగిక దాడుల నియంత్రణకు ఐసీడీఎస్ ఎంతగానో కృషి చేస్తోంది. ఐసీడీఎస్, చైల్డ్‌లైన్ ఇతర లైన్ డిపార్టుమెంట్స్‌తో కలిసి పిల్లల ఇబ్బందులను గుర్తించి కాల్స్ వచ్చిన వెంటనే వెళ్లి రెస్క్యూ చేసి సంరక్షిస్తున్నాం. స్కూళ్లు, కళాశాలల్లో అవగాహన కల్పిస్తున్నాం. స్కూళ్లలో మానిటరింగ్ కమిటీలు కూడా ఏర్పాటు చేయిస్తున్నాం. ముఖ్యంగా ఇంట్లో పిల్లలకు తల్లిదండ్రులు అవగాహన కల్పించాలి. **-శ్రీదేవి, ఐసీడీఎస్ పీడీ**

కరువు సహాయక చర్యలు వెంటనే చేపట్టాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం కల్చరల్, ఆగస్టు 4: గత సంవత్సరం ప్రకటించిన కరువు సహాయక చర్యలను వెంటనే చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన సీపీఎం జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాలు రాకపోవడంతో ఈ ఏడాది ఖరీఫ్‌లో పంటల సాగు గణనీయంగా తగ్గిందన్నారు. జిల్లా అంతటా కరువు పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో 2023 సంవత్సరం ఖరీఫ్, రబీ సీజన్లలో ప్రకటించిన ఇన్సూరెన్స్ వెయ్యి కోట్లు వెంటనే రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గతేడాది ఖరీఫ్‌లో 28, రబీలో 14 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించినా సరైన సహాయక చర్యలు చేపట్టలేదని, దీనివల్ల రైతాంగం తీవ్ర అప్పుల్లో కూరుకుపోయిందన్నారు. ఈ ఏడాది జిల్లా అంతటా కరువు పరిస్థితులు నెలకొన్నాయని, ఈ పరిస్థితుల్లో రైతాంగాన్ని ఆదుకునేందుకు తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. ఉపాధి హామీ పథకం ద్వారా అదనపు పనిదినాలు కల్పించి, కూలీలకు పనులు పెట్టాలన్నారు. పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. కేరళ వరదబాధితుల సహాయార్థం ఈనెల 5, 6వ తేదీల్లో విరాళాలు సేకరించనున్నట్లు తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నల్లప్ప అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య సావిత్రి, నాగేంద్రకుమార్, శ్రీనివాసులు, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.23

అనంతపురంరూరల్, ఆగస్టు 4: కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.23తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు ఆదివారం 2700 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.18, కనిష్ఠ ధర రూ.13 పలికినట్లు ఆయన తెలిపారు.

రోజులు మారాయ్!

- జిల్లాలో ఇసుక సమస్యకు చెక్
- అక్రమ ట్రాన్స్‌పోర్టర్లపై నిఘా
- కట్టడికి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్
- త్వరలో అందుబాటులోకి ఐదు రీచ్‌లు


ట్రాక్టర్‌లోకి ఇసుక నింపుతున్న కూలీలు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 4: అక్రమ ట్రాన్స్‌పోర్టర్లపై జిల్లా యంత్రాంగం నిఘా ఉంచిన నేపథ్యంలో ఇక నుంచి ఇసుక సమస్యకు చెక్ పడనుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఉచితంగా ఇసుక అందించేందుకు ఇప్పటికే శ్రీకారం చుట్టింది. అయితే గత ప్రభుత్వంలో ఆదాయవనరుగా భావించిన కొందరు ట్రాన్స్‌పోర్టర్లు ఇప్పటికీ ఇసుకను అధిక ధరకు విక్రయిస్తూ ప్రభుత్వంపై బురద జల్లేందుకు యత్నిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక పాలసీని తీసుకువచ్చారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాజకీయ నాయకులు జోక్యం చేసుకుని ఇష్టానుసారంగా ఇసుకను కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ ప్రాంతాలకు తరలించి జేబులు నింపుకున్నారు. అయితే ఇందుకు భిన్నంగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీని అమలు చేస్తోంది. పైగా రాజకీయనాయకులు ఇసుక జోలికి వెళ్లొద్దని సీఎం చంద్రబాబునాయుడు ఇప్పటికే హెచ్చరించిన సంగతి తెలిసిందే. జిల్లాలో జూలై 8న ఉచిత ఇసుక పాలసీలో భాగంగా రాయదుర్గం మండలం జుంజురాంపల్లిలో ఇసుక డంపింగ్ యార్డు ప్రారంభించారు. జుంజురాంపల్లి ఇసుక స్టాక్‌పాయింట్‌లో 58వేల టన్నులు అందుబాటులోకి తీసుకు వచ్చారు. 21వేల టన్నుల ఇసుకను విక్రయించారు. ఇక మిగిలిన 37వేల టన్నుల ఇసుకను విక్రయించనున్నారు. దీంతో పాటు ఆయా ప్రాంతాల్లో గుర్తించిన ఐదు ఇసుక రీచ్‌లను త్వరలో ప్రారంభించేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది.

ట్రాన్స్‌పోర్టర్లపై ప్రత్యేక నిఘా

ఇసుకను అక్రమంగా తరలిస్తూ...అధిక ధరకు విక్రయిస్తున్న ట్రాన్స్‌పోర్టర్లపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక నిఘా ఉంచింది. వైసీపీ ప్రభుత్వంలో అక్రమార్జనకు అలవాటుపడ్డ ట్రాన్స్‌పోర్టర్లు ప్రస్తుతం ఆదే కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. అలాంటి వారి ఆటకట్టించేలా త్వరలో ఆన్‌లైన్ విధానాన్ని తీసుకువచ్చి, వాహనాలకు జీపీఎస్ అమర్చాలని ప్రభుత్వం యోచిస్తోంది.

ఐదు రీచ్‌లు... అందుబాటులో 2 లక్షల టన్నులు..

జిల్లాలో డిమాండ్‌కు తగ్గట్లుగా ప్రభుత్వం గుర్తించిన ఐదు రీచ్‌లను త్వరలో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఐదు రీచ్‌ల్లో సుమారు రెండు లక్షల టన్నుల ఇసుకను విక్రయించనున్నారు. ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చి ప్రారంభానికి సిద్ధంగా ఉన్న రీచ్‌లలో కంబదూరు మండలం కర్తనపల్లి, గార్లదిన్నె మండలం ఇల్లూరు, బ్రహ్మసముద్రం మండలం అజ్జయ్యదొడ్డి, యల్లనూరు మండలం చిలమకూరు, కణేకల్లుమండలం రచ్చుమర్రి ఉన్నాయి. ఒక వ్యక్తికి రోజుకు 20 టన్నుల వరకు ఉచితంగా ఇసుకను అందించనున్నారు. ఇసుక కావాల్సివారు నేరుగా స్టాక్ పాయింట్ దగ్గరకు ఆధార్ కార్డు, మొబైల్ నంబరు, ఎక్కడికి తరలించాలనే వివరాలతో పాటు వాహనంతో వెళితే ఇసుక తీసుకెళ్లొచ్చు.

టన్ను రూ.195

జిల్లా ఇసుక కమిటీ ఆధ్వర్యంలో ఇసుక ధరలు నిర్ధారించారు. ఛైర్మన్‌గా జిల్లా కలెక్టర్, మెంబర్ కన్వీనర్‌గా భూగర్భ గనుల శాఖ డీడీ, సభ్యులుగా జాయింట్ కలెక్టర్, ఎస్పీ, సెబ్ అడిషనల్ ఎస్పీ, గ్రౌండ్‌వాటర్ డీడీ, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈలు, డీటీసీలు సభ్యులుగా ఉంటారు. ఇసుక కమిటీ ఇప్పటికే తవ్వకం, లోడింగ్, సీనరీజ్‌తో కలిసి ఒక టన్ను ఇసుకను రూ.195గా నిర్ధారించింది. కమిటీ నిర్ధారించిన ధరకు మాత్రమే ఇసుకను విక్రయించాలని ఇప్పటికే జిల్లా కలెక్టర్ ఆదేశించారు. దీంతో భవన నిర్మాణ రంగం పుంచుకుని చేతినిండా పని దొరుకుతుందని భవన నిర్మాణ కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు



జిల్లాలో ప్రభుత్వ నిబంధ నలకు లోబడే ఇసుక విక్రయం, రవాణా జరగాలి. నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను అధిక ధరకు విక్రయించినా, అక్రమంగా రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవు. ఇప్పటికే కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా ఇసుక కమిటీ పరిశీలిస్తోంది. రవాణాశాఖ, పోలీసులు, రెవెన్యూశాఖల సంయుక్తంగా ఇసుక విక్రయాలపై నిఘా పెంచాం. జిల్లాలో మరిన్ని ఇసుక రీచ్‌లు, డంపింగ్‌యార్డులు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం పరిశీలిస్తోంది.

-నాగయ్య, డీడీ, జిల్లా భూగర్భగనుల శాఖ

ఉన్నంతలో దోచేద్దాం!



- పలు ప్రభుత్వ కార్యాలయాల్లో చకచకా పనులు
- పనిని బట్టి రూ.5వేల నుంచి 10వేలు వసూలు
- దగ్గరుండి సెటిల్‌మెంట్లు చేస్తున్న వైనం
- పుట్లూరు మండలంలో చెలరేగుతున్న అధికారులు

తాడిపత్రి, ఆగస్టు 4: కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు చకచకా జరిగిపోతున్నాయి. ఒక్కరంటే ఒక్కరు తమ పని పెండింగ్‌లో ఉందని అడిగే వారే లేడు. దీనికి మామూళ్లే ప్రధాన కారణం. ఎందుకంటే ఇక్కడ పనిని బట్టి మామూళ్ల వసూలు చేస్తున్నారు. ఈ తతంగమంతా పుట్లూరు మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో సాగుతోంది. సార్వత్రిక ఎన్నికల నిర్వహణ నిమిత్తం ఎక్కడినుంచో అధికారులు బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఎన్నికలు ముగియడంతో ప్రభుత్వం అధికారులను తమతమ స్థానాలకు పంపుతోంది. దీంతో ఉన్నంతలో చక్కబెట్టుకోవాలని భావించిన అధికారులు సెటిల్‌మెంట్లకు పూనుకున్నారు. ఇప్పుడు కాకపోతే మరెప్పుడు అన్న చందంగా ఏ ఒక్క ఫైల్‌ను విడిచిపెట్టకుండా అందినకాడికి దోచుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మండలంలో ఎక్కడ పెండింగ్ ఫైళ్లు ఉన్నాయో తెలుసుకొని మరీ అధికారులు సిబ్బందిని పంపించి పంచాయతీలకు పిలిపించి వాటాలు మాట్లాడుకొని పనులు చేసి పెడుతున్నారంటే అక్రమార్జనలో వారి నిబద్ధత అర్థమవుతోంది.

చకచకా పనులు

సాధారణంగా ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు జరగాలంటే నెలలు, సంవత్సరాలు పడుతుంటాయి. కానీ పుట్లూరు మండలంలో మాత్రం డబ్బులుంటే చాలు పనులు చకచకా సాగిపోతుంటాయి. దీనికి ఎవరూ అతీతులు కారు. సామాన్య ప్రజల నుంచి రాజకీయ నాయకుల వరకు అధికారులు ఎవరిని వదలడం లేదు. కొన్ని రోజుల్లో బదిలీపై వెళుతుండటంతో అక్రమార్జనను వేగవంతం చేశారు. ప్రజలు కార్యాలయాలకు వెళ్లడం కాదు అధికారులే సిబ్బంది చేత సమస్యలున్న వారిని గుర్తించి వారివద్దకు వెళ్లి మాట్లాడి పంచాయతీలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పనిని బట్టి రేట్ ఫిక్స్

ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో పనిని బట్టి రేట్ ఫిక్స్ చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఒక పనికి కనీసం రూ.2వేల నుంచి రూ. 10వేల వరకు వసూళ్లకు పాల్పడుతున్నారని తెలిసింది. బదిలీ అయ్యేలోపే నాలుగు రాళ్లు వెనకేసుకోవాలని విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఇక రాజకీయ నాయకులను సైతం వీరు వదలడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారపక్షం, ప్రతిపక్షం అనే తేడా లేకుండా అధికారులు విచ్చలవిడిగా వసూళ్లకు పాల్పడుతున్నారని తెలుస్తోంది. పెండింగ్‌లో ఉన్న ప్రతి ఫైల్‌ను బయటకు తీసి సెటిల్‌మెంట్లు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ఏ ఒక్కరిని వదలకుండా ప్రతి ఫిర్యాదుదారుడితో కూర్చొని మాట్లాడి నీ పని నేను చేయిస్తా నాకెంత ఇస్తావ్ అంటూ బహిరంగంగా మాట్లాడుకొని పనులు చేయించి పెడుతున్నట్లు సమాచారం.

ప్రభుత్వం.. రైతులను ఆదుకోవాలి

మాజీ మంత్రి శైలజానాథ్



మాట్లాడుతున్న శైలజానాథ్

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 4: రాష్ట్ర ప్రభుత్వం.. జిల్లా రైతాంగాన్ని ఆదుకోవాలని మాజీ మంత్రి సాకే శైలజానాథ్ కోరారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లా రైతుల పరిస్థితి దయనీయంగా తయారైందన్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. వేరుశనగ పంట ఎండిపోయే పరిస్థితి నెలకొందన్నారు. రైతులను ఆదుకొనే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సూచించారు. వైసీపీ హయాంలో రైతులను ఆదుకోవడానికి ఏ ఒక్క ప్రయత్నం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టపరిహారం ఇవ్వలేదనీ, సబ్సిడీ పరికరాల ఊసేలేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులను ఆదుకోవాలన్నారు. నీటి సమస్యపై చర్చించడానికి అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి, న్యాయం జరిగేలా చూడాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు.. సమస్యలను ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రుల దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు వాసు, నాయకులు రామ్‌చరణ్‌యాదవ్, ఆంజనేయులు, శర్మాస్ వలి, ఇంద్రావతి, మురళి, కవిత పాల్గొన్నారు.


కేరళ, తమిళనాడు జట్ల విజయం



తమిళనాడు, గుజరాత్ జట్ల మధ్య మ్యాచ్‌కు టాస్ వేస్తున్న అంపైర్

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 4: జాతీయ ఫుట్‌బాల్ పోటీల్లో కేరళ, తమిళనాడు జట్లు విజయం సాధించాయి. జాతీయ జూనియర్ బాలికల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్-2024-25 పోటీలు శనివారం స్థానిక అనంత క్రీడాగ్రామంలో రెండోరోజు ఆదివారం కొనసాగాయి. గుజరాత్‌పై తమిళనాడు, అరుణాచల్‌ప్రదేశ్‌పై కేరళ జట్లు గెలుపొందాయి. విశ్రాంత డీఎస్‌డీఓ సుధాకర్, అంతర్జాతీయ కబడ్డీ ప్లేయర్ విశ్వనాథ్ చౌదరి, ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, డైరెక్టర్ రావూరి రాజేష్, జిల్లా కార్యదర్శి కూడేరు మల్లేష్, ఉపాధ్యక్షుడు నాగరాజు, కార్యవర్గసభ్యుడు రాజా, క్రీడాకారులు పాల్గొన్నారు.

తుంగభద్రకు కొనసాగుతున్న వరద



టీబీడ్యాం గేట్ల నుంచి విడుదలవుతున్న వరదనీరు

బొమ్మనహాళ్, ఆగస్టు 4: తుంగభద్ర జలాశయానికి వరద కొనసాగుతోంది. శనివారం సాయంత్రం 1,38,394 క్యూసెక్కుల నీరు జలాశయంలోకి వచ్చి చేరాయి. దీంతో 33 గేట్లలో 25 గేట్లను మూడున్నర అడుగులు, మిగతా 5 గేట్లను ఒక్క అడుగు పైకి ఎత్తి 1,34,888 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం డ్యాంకు ఇన్‌ఫ్లో 1,38,394 క్యూసెక్కులుండగా ఔట్‌ఫ్లో నదికి, కాలువలకు వదిలే నీటితో కలిపి 1,49,250 క్యూసెక్కులు ఉంది. డ్యాం కెపాసిటీ 1633 అడుగులతో 105.788 టీఎంసీలు ఉండగా శుక్రవారం సాయంత్రం నాటికి 1631.09 అడుగులతో 98.220 టీఎంసీల నీటిని నిల్వ ఉంది. హెచ్చెల్సీ ఆంధ్రా సరిహద్దు 105 కి.మీ. వద్ద 1133 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

ఏసీఏ త్రిసభ్య కమిటీ సభ్యుడిగా మాంచో ఫెర్రర్



అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 4: ఆంధ్రా క్రికెట్ సంఘం (ఏసీఏ) త్రిసభ్య కమిటీలో జిల్లాకు చెందిన ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్‌కు చోటు దక్కింది. ఇటీవల అసోసియేషన్ కార్యవర్గం రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఆదివారం అమరావతి లో నిర్వహించిన అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో త్రిసభ్య కమిటీని నియమించారు. నూతన కార్యవర్గం ఎంపిక అయ్యేవరకు త్రిసభ్య కమిటీ ఏసీఏ కార్యకలాపాలు, క్రికెట్ పోటీల నిర్వహణను పర్యవేక్షిస్తుంది.

దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తి, ఆగస్టు 4: డీఎస్సీ శిక్షణ పొందేందుకు అర్హులైన ఎస్టీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి మోహన్‌రాం ఆదివారం ప్రకటనలో తెలిపారు. స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ ఉద్యోగాల పోటీ పరీక్షల కోసం గిరిజన అభ్యర్థులకు శిక్షణ ఇస్తామన్నారు. డిగ్రీ-బీఈడీ, ఇంటర్-డీఈడీ, టెట్ పరీక్ష ఉత్తీర్ణత సాధించిన ఎస్టీ అభ్యర్థులను మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తామన్నారు. దరఖాస్తులు అనంతపురంలోని పెన్నార్ భవన్‌లో గల జిల్లా గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో లభిస్తాయన్నారు. దరఖాస్తులను ఈనెల 13వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు పెన్నార్ భవన్‌లోని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో అందజేయాలని ఆయన వివరించారు.

ముగిసిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు

తాడిపత్రి, ఆగస్టు 4: పట్టణంలోని బాలాజీ ఫంక్షన్‌హాలులో రెండురోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు ఆదివారం ముగిశాయి. సబ్ జూనియర్ బాలుర విభాగంలో పోటీలు జరిగాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి మొత్తం 200మంది క్రీడాకారులు పాల్గొన్నారని ఆర్గనైజర్ సాయి తెలిపారు. ఈ పోటీల్లో మొదటిస్థానంలో విజయనగరం జిల్లా జట్టు నిలవగా, ద్వితీయ స్థానంలో అనంతపురం జట్టు, తూర్పుగోదావరి జిల్లా మూడవస్థానంలో నిలిచిందని ఆయన తెలిపారు. గెలుపొందిన జట్లకు ఛాంపియన్ ట్రోఫీలను రాష్ట్ర స్థాయి తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి వేణుగోపాల్‌రావు, టీడీపీ కౌన్సిలర్ కొత్తపల్లి మల్లికార్జున, కమలమ్మలు అందజేశారు.



సర్టిఫికెట్లను చూపుతున్న క్రీడాకారులు

మినీ గోకులాలకు శ్రీకారం..!

పునఃప్రారంభించిన కూటమి ప్రభుత్వం

పాడి రైతులకు సదవకాశం

సబ్సిడీతో నిర్మించుకునేందుకు ప్రభుత్వం సాయం

అనంతపురంరూరల్, ఆగస్టు 4: వ్యవసాయం తరువాత పాడిపరిశ్రమపైనే రైతులు ఎక్కువగా ఆధారపడి జీవిస్తున్నారు. చాలామంది రైతులు వ్యవసాయంలో నష్టాలపాలై, పాడి పరిశ్రమపైపు చూస్తున్నారు. ఇలాంటి వారికి కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. 2017-19లో అప్పటి టీడీపీ ప్రభుత్వం మినీ గోకులాలకు శ్రీకారం చుట్టింది. కొంతమంది ఉపాధి హామీ పథకం కింద మినీ గోకులాలను నిర్మించుకున్నారు. ఎన్నికలు రావడం ఆ తరువాత వైసీపీ అధికారం చేపట్టడంతో పథకానికి పూర్తిగా స్వస్తి పలికింది. మినీ గోకులాలు నిర్మించుకున్న వారికి బిల్లులు కూడా చెల్లించకుండా ఇబ్బంది పెట్టారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టింది. ఈక్రమంలోనే మళ్లీ మినీ గోకులాల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించింది. ఆమేరకు సంబంధిత శాఖ అధికారులకు మినీగోకులాల నిర్మాణాలు చేపట్టాలంటూ ఆదేశాలు ఇచ్చింది. ఇదే క్రమంలో టీడీపీ హయాంలో నిర్మించుకున్న వారి వివరాలు సేకరించాలని నిర్ణయించింది. దీంతో ఆయా వర్గాల్లో తిరిగి ఆశలు రేకెత్తుతున్నాయి.

సబ్సిడీతో ప్రభుత్వ సాయం

పాడి రైతులు జిల్లాలో మినీ గోకులాలు నిర్మాణంకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈక్రమంలోనే 1400 యూనిట్లకు పైగా మినీ గోకులం షెడ్లు కేటాయించింది. జాతీయ ఉపాధి హామీ పథకం నుంచి నిధులు మంజూరు చేయనుంది. అనంతపురం రూరల్ మండలంకు 50మినీగోకులం షెడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు పశుసంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే మండలంలో 20కిపైగా దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. గతంలో మాదిరిగానే పశుపోషకులకు 90శాతం, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకందార్లకు 70శాతం సబ్సిడీతో గోకులం షెడ్లు నిర్మించనుంది. 2018-19లో మినిగోకులం షెడ్లు నిర్మించుకున్న వారికి బిల్లు చెల్లించాలని సంబంధిత రైతులు.. అధికారులను కోరినట్లు తెలుస్తోంది. ఆమేరకు అధికారులు వివరాలు సేకరిస్తున్నట్లు ఆయావర్గాల ద్వారా తెలుస్తోంది.



వివరాల బోర్డు

ఇవీ అర్హతలు..

- ఎస్సీ, ఎస్టీ, వలస, డీ-నోటిఫైడ్ తెగలవారు
- దారిద్ర రేఖకు దిగువనున్నవారు
- మహిళా యజమాని, అంగవైకల్యం యజమాని కుటుంబాలు
- భూసంస్కరణ, పీఎంఏవైజీ లబ్ధిదారులు
- అటవీ హక్కుల చట్ట-2006 లబ్ధిదారులు
- చిన్న, సన్నకారు రైతులు

జత చేయవలసిన పత్రాలు..

- అప్లికేషన్ ఫారం
- ఆధార్‌కార్డు
- జాబ్‌కార్డు
- స్థలం హక్కు పత్రం
- బ్యాంకు పాస్‌బుక్

మన్ని వివరాలకు పశువైద్యశాలలోగానీ, రైతు సేవా కేంద్రంలోగానీ సంప్రదించవచ్చు.

- 2 పశువుల మినీ గోకులం షెడ్డు వివరాలు
యూనిట్ విలువ: రూ.1,15,000
ఉపాధి హామీ నిధులు రూ:1,03,500
రైతు వాటా రూ:11,500
- 4 పశువుల మినీగోకులం షెడ్డు వివరాలు
యూనిట్ విలువ: రూ.1,85,000
ఉపాధి హామీ నిధులు రూ:1,66,500
రైతు వాటా రూ: 18,500
- 6 పశువుల మినీగోకులం షెడ్డు వివరాలు
యూనిట్ విలువ: రూ.2.30లక్షలు
ఉపాధి హామీ నిధులు రూ:2.07లక్షలు
రైతు వాటా రూ: 23వేలు

గొర్రెలు, మేకలషెడ్డు వివరాలు

- 20 జీవాల షెడ్డు
యూనిట్ విలువ:రూ.1.30లక్షలు
ఉపాధి హామీ నిధులు రూ:91వేలు
రైతు వాటా రూ.39వేలు
- 50 జీవాల షెడ్డు
యూనిట్ విలువ: రూ.2.30లక్షలు
ఉపాధి హామీ నిధులు: రూ:1.61లక్షలు
రైతు వాటా: రూ.69వేలు

కోళ్ల షెడ్ వివరాలు..

- 100కోళ్ల షెడ్
యూనిట్ విలువ: రూ.87వేలు
ఉపాధి హామీ నిధులు: రూ.60,900
రైతు వాటా: రూ.26,100
- 200 కోళ్ల షెడ్
యూనిట్ విలువ: రూ.1.32లక్షలు
ఉపాధి హామీ నిధులు :రూ.92,400
రైతు వాటా: రూ.39,600



ప్రతాప్ నిర్మించుకున్న మినీ గోకులం షెడ్డు



ఈ పాడి రైతు పేరు ప్రతాప్. అనంతపురం రూరల్ మండలం, క్రిష్ణంరెడ్డి పల్లి. తన అన్న శివయ్య పేరు మీద ఉపాధి హామీ పథకం కింద 2018-19లో మినీగోకులం షెడ్డు నిర్మాణం చేపట్టాడు. ఈ క్రమంలోనే రైతు వాటా కింద రూ.20వేలు డీడీ రూపంలో చెల్లించాడు. షెడ్డు నిర్మాణం పూర్తి చేసుకున్నాడు. అయితే 2019సాధారణ ఎన్నికలు జరగడంతో వైసీపీ అధికారంలోకి వచ్చింది. తరువాత మినీగోకులాలకు వైసీపీ నిధులు కేటాయించలేదు. ఇప్పుడైనా ప్రభుత్వం మినీగోకులం షెడ్డు నిర్మాణానికి సంబంధించిన బిల్లు ఇస్తే మేలు చేసినట్లు అవుతుందని అంటున్నాడు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

మినీగోకులం షెడ్ల నిర్మాణాలను ప్రభుత్వం తిరిగి ప్రారంభించింది. మండలానికి 50 యూనిట్లు కేటాయించారు. ఆసక్తిగల రైతులు సద్వినియోగం చేసుకోవాలి. ఇప్పటికే కొన్ని దరఖాస్తులు వచ్చాయి.

- శారద, పశువైద్యాధికారి, అనంతపురంరూరల్ మండలం

శ్రావణం... ఆధ్యాత్మిక పరిమళం

నెల ఆద్యంతం పండుగలే..

హనుమాన్ దర్శన్‌కు ఆర్టీసీ బస్సు సర్వీసులు



అనంతపురం కల్చరల్, ఆగస్టు 4: ఏదైనా నెలలో ఒకరోజో, వారమో ప్రత్యేకం ఉంటుంది. నెలలోని ప్రతి రోజూ ఓ పండుగే అంటే అది శ్రావణమాసమే. తెలుగు క్యాలెండర్ ప్రకారం ఐదవ నెలలో వచ్చేదే శ్రావణమాసం. ఎన్నో ఆధ్యాత్మిక ప్రయోజనాలున్న మాసం. ఆదివారం నాటి అమావాస్యతో ఆషాఢమాసం సమాప్తమవగా సోమవారం నుంచి శ్రావణమాసం ఆరంభమైంది. ఈ మాసంలో శివుడికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించడం ఆనవాయితీ. హిందువులకు శ్రావణమాసం ఎంతో ప్రత్యేకం. ఈనెలలో వచ్చే సోమవారాలు, మంగళవారాలు, శుక్రవారాలు, శనివారాలు ఎంతో పవిత్రమైనవి. అందుకే ఈ నాలుగు వారాలలో ఆలయాలు, ఇళ్లల్లో ఎంతో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తుంటారు. దక్షిణాయనంలో వచ్చే విశిష్ట మాసాల్లో శ్రావణమాసం ఒకటి. ఈ మాసం శివపూజకు విశిష్టమైనది. అలాగే ఈ నెలలో చేసే ఏ చిన్న దైవకార్యమైనా వేలరెట్ల శుభఫలితాలనిస్తుందని పురాణాలు చెబుతున్నాయి. ఇంతటి పవిత్రమైన, శక్తివంతమైన శ్రావణమాసంలో వచ్చే సోమవారాల్లో చాలామంది ఉపవాసాలుండి పరమశివుడికి అభిషేకాలు చేస్తారు. ఇలా చేయడాన్ని శ్రావణసోమవార వ్రతమని పిలుస్తుంటారు. సూర్యోదయానికి ముందే నిద్రలేచి, స్నానమాచరించి, శివాలయాన్ని సందర్శించి పాలు, నీళ్ల కలిపిన పదార్థంతో శివలింగానికి అభిషేకం చేయాలి. అభిషేకం చేస్తున్నంతసేపు నిర్విరామంగా నమఃశివాయ అంటూ స్తుతించాలి. అదేవిధంగా మంగళవారం చేసే వ్రతాలను మంగళగౌరీ వ్రతాలు అని పిలుస్తుంటారు. ఇక శుక్రవారాల్లో వరలక్ష్మీ వ్రతాలు, శనివారాల్లో విష్ణుమూర్తి అవతారమైన వెంకటేశ్వరస్వామిని స్తుతిస్తూ ఏడుశనివారాల వ్రతాలు నిర్వహించడం ఆనవాయితీ. శ్రావణమాసం చాలా విశిష్టమైంది. శ్రీకృష్ణ జన్మాష్టమి, రక్షాబంధన్, నాగపంచమి పండుగలు ఈ నెలలో వస్తాయి. అదేవిధంగా పెళ్లిళ్లకు ఈ మాసం చాలా పవిత్రమైనదిగా భావిస్తుంటారు.

హనుమాన్ దర్శన్‌కు ఆర్టీసీ బస్సు సర్వీసులు శ్రావణమాసంలోని మంగళ, శనివారాల్లో ఒకేరోజున మూడు ఆంజనేయస్వామి దేవాలయాలను దర్శించుకోవడం జిల్లాలో ఆనవాయితీగా వస్తోంది. ఇందుకోసం ప్రతియేటా అనంత ఆర్టీసీ శ్రావణమాసంలో ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతోంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది శ్రావణమాసం కూడా బస్సు సర్వీసులను నడపనున్నట్లు అనంతపురం డీఎం నాగభూపాల్ వెల్లడించారు. ఈనెల 6, 10, 13, 17, 20, 24, 27, 31వ తేదీల్లో కసాపురం, మురడి, నేమకల్లు ఆంజనేయస్వామి దేవాలయాలను దర్శించుకునే భక్తులకోసం బస్సు సర్వీసులను నడపుతున్నట్లు పేర్కొన్నారు. మూడు ఆంజనేయస్వామి దేవాలయాలను ఒకేరోజున దర్శించుకునేందుకు రాను, పోను చార్జీలు పెద్దలకు రూ.495లు, పిల్లలకు రూ.250లుగా నిర్ణయించడం జరిగిందన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం ముందస్తు రిజర్వేషన్ కూడా ఉందన్నారు.

పుణ్యఫలాలను ప్రసాదించే మాసం

మాసాలన్నింటిలోకెల్లా అత్యధికంగా పుణ్యఫలాలను ప్రసాదించే మాసమేదైనా వుందంటే అది శ్రావణమాసమే. ఈనెల 5 నుంచి సెప్టెంబరు 3వ తేదీ వరకు శ్రావణమాసం వుంటుంది. ముత్తైదువులు ఈ మాసంలో అమ్మవారికి ముఖ్యంగా శ్రీచక్ర కుంకుమార్చన చేసుకోవడం వల్ల శుభఫలితాలను పొందుతారు.

నరసింహశాస్త్రి, కాశీవిశ్వేశ్వర కోదండ దేవాలయం, అనంతపురం

అండర్-14 క్రికెట్ జట్టు సెలెక్షన్స్‌కు అనూహ్య స్పందన

సెలక్షన్ కమిటీలో రాజకీయ నాయకుల ప్రమేయంపై తల్లిదండ్రుల ఆగ్రహం

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 4: జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఆర్డీటీ స్టేడియంలో అండర్-14 బాలుర జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ ఎంపిక పోటీలకు అనూహ్య స్పందన వచ్చింది. జిల్లావ్యాప్తంగా 229మంది క్రీడాకారులు పోటీలకు హాజరయ్యారు. అయితే సెలెక్షన్ కమిటీ చైర్మన్‌గా నగరపాలక సంస్థ కార్పొరేటర్ చంద్రమోహన్‌రెడ్డిని నియమించడం పట్ల పలువురు క్రీడాకారుల తల్లిదండ్రులు అభ్యంతరం వ్యక్తం చేశారు. రాజకీయ నాయకుల జోక్యంతో జిల్లాలో క్రికెట్ పతనమవుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సెలెక్షన్ కమిటీలో రాజకీయాలకు సంబంధం లేని వ్యక్తులను నియమిస్తేనే నైపుణ్యతగల క్రీడాకారులకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. అయితే ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని నైపుణ్యం ఉన్న క్రీడాకారులను పారదర్శకంగా ఎంపిక చేస్తామని క్రికెట్ సంఘం జిల్లా కార్యదర్శి మధు ఆచారి తెలిపారు. అనంతరం క్రీడాకారుల బౌలింగ్, బ్యాటింగ్, ఫీల్డింగ్, కీపింగ్, ఫిట్‌నెస్‌ను పరిశీలించారు.

కలకలం..

ప్రధాన రహదారిలోని ఏటీఎంలో చోరీ

కట్టర్లతో కట్ చేసి నగదు అపహరణ

కర్ణాటకలో ఇద్దరి పట్టివేత?

పరారీలో మరొకరు..



సీసీ కెమెరాకు బ్లాక్ స్ప్రే కొట్టిన దృశ్యం

అనంతపురం క్రైం, ఆగస్టు 4: నగరంలో ఆదివారం తెల్లవారుజామున కలకలం రేగింది. రద్దీగా ఉండే.. రామ్‌నగర్ ప్రధాన రహదారిలోని ఏటీఎంలో దొంగలు పడ్డారు. నిత్యం రద్దీగా ఉండే, రాత్రిపూట వాహనాలు తిరిగే ప్రాంతంలోని ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీ చేశారు. ముఖాలకు మాస్కులు ధరించిన ముగ్గురు దర్జాగా కారులో వచ్చారు. ఒకరేమో ఏటీఎం కేంద్రంలోని సీసీ కెమెరాలకు బ్లాక్ స్ప్రే కొట్టారు. తర్వాత ముగ్గురూ కలిసి కట్టర్లతో ఏటీఎం మిషన్‌ను కట్ చేసి, అందులోని రూ.29.81 లక్షల నగదును ఎత్తుకెళ్లారు. ఈ మొత్తం తతంగాన్ని 15 నిముషాల్లోనే పూర్తి చేశారంటే ఆ దొంగలు ఎంత అనుభవజ్ఞులో అర్థం చేసుకోవచ్చు. ఆదివారం తెల్లవారుజామున 2.40 గంటల సమయంలో ఈ చోరీకి పాల్పడ్డారు. ముగ్గురు దుండుగులు చోరీ చేసినట్లు సీసీ టీవీ ఫుటేజీ ద్వారా పోలీసులు నిర్ధారించారు.

మోగిన అలారం

దొంగలు పడ్డ వెంటనే ముంబైలోని ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయంలో అలారం మోగింది. వెంటనే అక్కడి నుంచి జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి సమాచారం అందింది. అనంతపురం డీఎస్పీ టీవీవీ ప్రతాప్, నాలుగో పట్టణ సీఐ ప్రతాప్‌రెడ్డితోపాటు నగరంలోని సీఐలు రెడ్డప్ప, క్రాంతికుమార్, ధరణికిషోర్.. సిబ్బందితో కలిసి రంగంలోకి దిగారు. అప్పటికే దుండగులు కారులో పరారయ్యారు. దొంగలు మూడు, నాలుగు రోజులుగా రెక్కీ నిర్వహించినట్లు తెలుస్తోంది.



దొంగలు కత్తిరించిన ఏటీఎం యంత్రభాగం

కర్ణాటకలో పట్టివేత?

ఏటీఎం చోరీకి పాల్పడిన ఇద్దరు.. పోలీసులకు పట్టుబడినట్లు తెలుస్తోంది. ఓ దొంగ పరారవగా.. అతడి కోసం పోలీసు బృందాలు అన్వేషిస్తున్నాయి. దొంగలు వాడిన వాహన లోకేషన్‌ను పోలీసులు టోల్‌గేట్లలో ఫాస్టాగ్ ఆధారంగా పట్టేశారు. స్థానిక పోలీసులకు సమాచారం అందేసరికి ఆ వాహనం కర్ణాటకలోని తుమకూరు సమీపంలోని ధావనగెరికి వెళ్లినట్లు తెలిసింది. దీంతో జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ.. కర్ణాటక పోలీసులతో మాట్లాడారు. ఆ సందర్భంలో ఓ పోలీసు వాహనాన్ని దొంగలు ఢీకొట్టారు. ఇందులో ఎవరికీ ఏమీ కాలేదు. అనంతరం బాగల్‌కొటె సమీపంలో ఇద్దరు దొంగలను పట్టేశారని సమాచారం. దొంగలది హరియాణా రాష్ట్రంలోని మేవాడ్ అని సమాచారం. చోరీలు చేసేందుకు వారు విమానాల్లో వస్తారని పోలీసుల ద్వారా తెలుస్తోంది. ప్రధాన రహదారిలోని ఏటీఎంలో చోరీ జరగడంతో పోలీసు గస్తీపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.



తెగిపడిన విద్యుత్ వైరు

ముదిగుబ్బలో తెగిపడ్డ విద్యుత్ వైరు

ఇద్దరు మహిళలకు గాయాలు



ముదిగుబ్బ, ఆగస్టు 4: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద 11 కేవీ విద్యుత్ వైరు తెగిపడి ఇద్దరు మహిళలకు గాయాలయ్యాయి. మండల కేంద్రానికి చెందిన వృద్ధురాలు తులసమ్మ తోపుడు బండిపై బఠాణీలు, కట్టకిందపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీ నరసమ్మ చెక్కిలాలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారు ఆదివారం వ్యాపారం చేసుకుంటుండగా విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వైరు తెగి వారి మీద పడడంతో గాయాలయ్యాయి. ముదిగుబ్బ సీఐ యతీంద్ర, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి తుమ్మల మనోహర్, చరణ్ మహిళలను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. తులసమ్మను మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం..

మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని లైన్‌మెనుల సమస్యలు ఉత్పన్నమైన సమయంలో స్పందించడంలేదని మండలవాసులు అంటున్నారు. విద్యుత్ అధికారులు, లైన్‌మెన్‌లు, సబ్‌స్టేషన్ ఆపరేటర్‌లకు ఫోన్ చేస్తే తీయడంలేదని, సబ్‌స్టేషన్ నెంబర్ ఎప్పుడూ స్విచ్‌ఆఫ్ వస్తోందని అంటున్నారు. మండల విద్యుత్ కార్యాలయానికి శాశ్వత ఏఈ లేకపోవడంతో కిందిస్థాయి ఉద్యోగులంతా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్న చందంగా ముదిగుబ్బ విద్యుత్ శాఖలో పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ప్రాణాలు పోతే తప్ప స్పందించరా అంటూ ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని, స్పందించి మండల విద్యుత్ ఏఈని నియమించాలని కోరుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళలను బీజేపీ మండల కన్వీనర్ సోమల ప్రకాష్, సీపీఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు, సూరి పరామర్శించారు.

శ్రావణమాస ఉత్సవాలకు ఆహ్వానం


ఉత్సవాల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం అర్బన్, ఆగస్టు 4: ఆత్మకూరు మండలం పంప నూరు క్షేత్రంలో 8వ తేదీ నుంచి జరిగే శ్రావణమాస ఉత్సవాలకు మాజీ రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతను ఆలయ నిర్వాహకులు ఆహ్వానించారు. ఆదివారం అనంతపురంలోని ఆమె నివాసంలో ఎమ్మెల్యేకు వారు ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం ఆలయ నిర్వాహకులతో కలిసి శ్రావణ మాస ఉత్సవాల కరపత్రాలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. 8, 9, 10, 11, 18, 25, వచ్చే నెల 1వ తేదీన ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఎమ్మెల్యేకు వివరించారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కృపాకటాక్షాలు జిల్లా ప్రజలందరికీ ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

స్నేహితురాలికి ఫ్రెండ్‌షిప్ బ్యాండ్ కట్టిన ఎమ్మెల్యే


స్నేహితురాలికి ఫ్రెండ్‌షిప్ బ్యాండ్ కడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం అర్బన్, ఆగస్టు 4: స్నేహితుల దినోత్సవం రోజున రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత తన స్నేహితురాలు సుగుణమ్మకు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్ కట్టారు. ఆదివారం అనంతపురం నగరంలోని తన నివాసంలో ఎమ్మెల్యే తన స్నేహితురాలికి బ్యాండ్ కట్టారు. అనంతరం ఆమె ఎమ్మెల్యేకు బ్యాండ్ కట్టారు. ఒకరికొకరు స్నేహితుల రోజు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. చిన్ననాటి వెంకటాపురం గ్రామానికి చెందిన తన భర్త పరిటాల రవి చిన్నసోదరి శైలజ, కురుబ సుగుణమ్మ తనకు చిన్ననాటి స్నేహితులని ఎమ్మెల్యే తెలిపారు.

నేడు స్టూడెంట్స్ మార్చ్

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 4: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)ని రద్దుచేయాలని సోమవారం స్టూడెంట్స్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వేమన తెలిపారు. ఆదివారం సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతీయస్థాయిలో విద్యావకాశాలు కల్పించేందుకు పారదర్శకమైన వ్యవస్థ పనిచేయాలన్నారు. అయితే ప్రతిభగల విద్యార్థుల భవిష్యత్తును బుగ్గిపాలు చేస్తూ పరీక్షా పత్రాలను అమ్ముతున్న ఎన్‌టీఏను రద్దుచేయాలన్న డిమాండ్‌తో ఢిల్లీ నుంచి కన్యాకుమారి వరకు స్టూడెంట్స్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఎస్ఎస్‌బీఎన్ కళాశాల నుంచి మార్చ్ నిర్వహించి ఆర్ట్స్ కళాశాలలో బహిరంగ సభను ఏర్పాటు చేశామన్నారు. అనంతరం పోస్టర్లను విడుదలచేశారు. నాయకులు బాలకృష్ణ, హేమంత్, కృష్ణ, నరేష్, హర్ష, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని జింక మృతి

నార్పల, ఆగస్టు 4: మండలంలోని దుర్గం గ్రామ సమీపంలో ఆదివారం గుర్తుతెలియని వాహనం ఢీకొని జింక మృతి చెందింది. దుర్గం కొండల నుంచి జింక రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. తీవ్రగాయాలై జింక మృతి చెందింది. కూలీలు చూసి ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. మృతిచెందిన జింకను ఫారెస్ట్ అధికారులు పరిశీలించారు. సర్పంచు రామాంజినేయులు సమక్షంలో జింకకు పోస్టుమార్టం నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో చౌడేశ్వరి జయంతి

అనంతపురం కల్చరల్, ఆగస్టు 4: చౌడేశ్వరి జయంతిని పురస్కరించుకుని ఆదివారం నగరంలోని పలు ఆలయాల్లో వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గుత్తిరోడ్డు ఐదులైట్ల సర్కిల్‌లోని చౌడేశ్వరి దేవాలయం, మొదటిరోడ్డులోని చౌడేశ్వరి దేవాలయాల్లో అమ్మవారి మూలవిరాట్‌కు వివిధ అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు చేసి పూజలు చేశారు. భక్తులు బోనాలు ఎత్తుకుని అమ్మవారి నామస్మరణ చేస్తూ ఊరేగింపు చేశారు. బెంగళూరు రోడ్డులోని తొగటవీర క్షత్రియ కల్యాణమండపంలో అమ్మవారికి ప్రత్యేక పూజాదికైంకర్యాలు నిర్వహించారు.

అనంతపురంరూరల్: మండలంలోని నరసనాయునికుంట గ్రామంలో వెలసిన సత్య చౌడేశ్వరీ దేవి జయంతిని గ్రామస్థుల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆషాఢ మాసం ఆదివారం అమావాస్య సందర్భంగా అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేశారు. పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

చెన్నేకొత్తపల్లి: మండలంలోని న్యామద్దల గ్రామంలో వెలసిన ఉమామహేశ్వరి, చౌడేశ్వరిదేవి జయంతి వేడుకలను ఆదివారం భక్తులు ఘనంగా నిర్వహించారు. ఆయా ఆలయాల్లో అమ్మవారిమూలవిరాట్‌ను ప్రత్యేక పూలతో అలంకరించి పూజలు చేశారు. అమ్మవార్లకు భక్తులు బోనాలు సమర్పించారు.

శింగనమల: మండలంలోని చౌడేశ్వరి అమ్మవారి దేవాలయాల్లో అమ్మవారి జయంతి వేడుకలు నిర్వహించారు. ఆదివారం గురుగుంట్ల, తరిమెల చౌడేశ్వరి అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేసి భక్తులు ముక్కుబడులు తీర్చుకున్నారు.


అనంతలో ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరిమాత


అనంతపురం రూరల్‌లో..


చెన్నేకొత్తపల్లిలో...


శింగనమలలో..


గుత్తిరోడ్డు ఐదులైట్ల సర్కిల్ వద్ద బోనాలతో భక్తుల ఊరేగింపు


ప్రభుత్వాస్పత్రి రోడ్డులో చౌడేశ్వరిమాతను ఊరేగిస్తున్న భక్తులు

ఆదర్శం... ఆ యువకుల సాయం

● వయనాడ్ బాధితుల కోసం నిత్యావసర సరుకుల సేకరణ

అనంతపురం కల్చరల్, ఆగస్టు 4: ఆ ఇద్దరు యువకులు తమ స్నేహితులతో కలిసి చేసిన సాయం ఆదర్శప్రాయంగా నిలుస్తోంది. అనంతపురం నగరంలోని ఓ సెల్ పాయింట్‌కు చెందిన షంషుద్దీన్, రోషన్ ప్రతి ఏడాది సహజసిద్ధ అందాలకు నిలయమైన వాయనాడ్‌కు వెళ్తుంటారు. అయితే ప్రస్తుతం ప్రకృతి ప్రకోపంతో వాయనాడ్‌లో 320 మందికి పైగా మృత్యువాత పడ్డారు. ప్రతిసారి తాము విడిదిచేసే ఆ ప్రాంతం హృదయ విదారకర పరిస్థితి చూసి ఈ యువకులు చలించిపోయారు. మానవతా దృక్పథంతో తమవంతు సహాయం అందించేందుకు ముందుకు వచ్చారు. హెల్ప్ వయనాడ్ అనే వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేసి అందులో తమ మిత్రులను చేర్చారు. తొలుత తమవంతుగా తలా పదివేలు జమ చేసి, మిగతా సహాయం కోసం మిత్రులను కోరగా వారు కూడా తోచినంత సహాయం అందించారు. ఇలా సేకరించిన సొమ్ము మొత్తం రూ.50వేలు కాగానే హోల్‌సేల్ దుకాణాలద్వారా నిత్యావసర వస్తు సామగ్రి కొనుగోలు చేసి, ఆదివారం బెంగళూరులోని మళయాలీ సమాజ్ కార్యాలయంలో అందజేశారు. సహాయమందించిన యువకులంతా 25 సంవత్సరాల్లోపువారే కావడం గమనార్హం. కార్యక్రమంలో జమీర్, సోమశేఖర్ పాల్గొన్నారు.



వయనాడ్ బాధితులకోసం సేకరించిన నిత్యావసరాలతో షంషుద్దీన్, రోషన్

ప్రతిబంధకాలను తెంచిన సుప్రీం

● వర్గీకరణ తీర్పుపై మాదిగ మేధావుల ఫోరం

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 4: ఎస్సీ వర్గీకరణ తీర్పుతో సమాన అవకాశాల సద్వినియోగ ప్రతిబంధకాల్ని సుప్రీం కోర్టు తెంచివేయడం హర్షణీయమని మాదిగల మేధావుల ఫోరం నాయకులు పేర్కొన్నారు. ఆదివారం ఫోరం ఆధ్వర్యంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి, ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం క్లాక్‌టవర్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఫోరం నాయకులు సతీష్ కుమార్, మారెప్ప మాట్లాడుతూ ఒకే అంశంపై మూడు దశాబ్దాల పోరాటాన్ని గుర్తించిన ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు ఎస్సీల చిరకాల ఆకాంక్షలను నెరవేర్చారని కొనియాడారు. అటెండర్ నుంచి ఐఏఎస్, ఐపీఎస్ వరకు వర్గీకరణ అమలుచేయాలని కోరారు. నాయకులు హరిప్రసాద్, బాల గంగాధర్, తిరుపాలు, శశికల, శంకర్, ఎల్ఐసీ మారెప్ప, కృష్ణమూర్తి, క్రిష్టప్ప, నారాయణ, సురేష్ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న మేధావుల ఫోరం నాయకులు

సీఎం చంద్రబాబు సమీక్షకు కలెక్టర్

అనంతపురం టౌన్, ఆగస్టు 4: సీఎంగా చంద్రబాబు నాయుడు బాధ్యతలు చేపట్టిన తరువాత మొదటిసారి పాలనాపరమైన అంశాలపై కలెక్టర్లుతో సోమవారం అమరావతి రాజధాని సచివాలయంలో సమీక్ష నిర్వహించనున్నారు. సమీక్షలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి ప్రగతి గురించి వివరిస్తూ కలెక్టర్లకు సీఎం లక్ష్యం విధించనున్నారు. ఈ నేపథ్యంలో సమీక్షకు కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ జిల్లా ప్రగతి నివేదికలతో ఆదివారం అమరావతికి బయలుదేరి వెళ్లారు. ఈ నేపథ్యంలో సోమవారం నిర్వహించనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తాను పాల్గొనడం లేదని, ఫిర్యాదుదారులు వచ్చే సోమవారం రావాలని ఒక ప్రకటనలో కలెక్టర్ కోరారు. మిగిలిన అధికారులు మీకోసంలో పాల్గొంటారన్నారు.

పశువుల సంత ఆదాయం రూ.2.94లక్షలు

అనంతపురంరూరల్, ఆగస్టు 4: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన పశువులసంతతో మార్కెట్‌కు రూ.2,94,600 ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా రూ.1,75,980, ఆదివారం ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.1,18,620 వచ్చిందని తెలిపారు.

అలరించిన సంగీత విభావరి


కిషోర్ కుమార్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కళాకారులు

అనంతపురం కల్చరల్, ఆగస్టు 4: సినీ గాయకుడు కిషోర్ కుమార్ 95వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం లలితకళా పరిషత్‌లో నిర్వహించిన హిందీ సినీ సంగీత విభావరి వీక్షకులను ఎంతగానో అలరించింది. తొలుత కిషోర్‌కుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి కళాకారులు నివాళులర్పించారు. అనంతరం కిషోర్ కుమార్ ఆలపించిన పాటలను పాడుతూ కళాకారులు స్వరనీరాజనం పలికారు. గాయకులు విశ్రాంత తహసీల్దార్ పాలసముద్రం నాగరాజు, ఎస్కేయూ విశ్రాంత రిజిస్ట్రార్ ఆచార్య సుధాకర్‌బాబు, బాలమురళీకృష్ణ, రామాంజి, చంద్రమౌళి, దాదా ఖలందర్, శ్రీదేవి, విజయలక్ష్మి, పద్మజ, జ్యోతి, సాయిచరిత, నిఖిత పాల్గొన్నారు.

మున్సిపల్ టీచర్ల బదిలీలు చేపట్టాలి

అనంతపురం విద్య, ఆగస్టు 4: అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లోని స్కూళ్లలో టీచర్ల కొరత ఉందని, వెంటనే బదిలీలు చేపట్టాలని ఎస్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఆ సంఘం కార్యాలయంలో నగర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సంఘం మున్సిపల్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఫణిభూషణ్ మాట్లాడుతూ ఆగస్టు నెల వచ్చినా టీచర్ల సర్దుబాటు చేయకపోవడం దారుణం అన్నారు. వెంటనే బదిలీలు చేపట్టి టీచర్ల సమస్య తీర్చాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు సైతం వెంటనే ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. టీచర్ల రేషనలైజేషన్ నిర్వహించి విద్యార్థులు ఎక్కువ ఉన్న స్కూళ్లకు పోస్టులను సర్దుబాటుచేయాలన్నారు. ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం పోస్టులలో ఉన్న వారి విల్లింగ్ ఆధారంగా స్కూల్ అసిస్టెంట్స్‌గా కన్వర్షన్ చేయాలని కోరారు. తెలుగు, హిందీ సబ్జెక్టుల ఉద్యోగోన్నతులు వెంటనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ టీచర్ల జీపీఎఫ్ కాతాలను జారీ చేయడంలో ఉన్న జాప్యాన్ని నివారించాలన్నారు. గతంలో అనంతపురం నగరపాలక సంస్థ పీఎఫ్‌లో ఉన్న టీచర్ల మొత్తాలను వెంటనే చెల్లించాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, ప్రధానకార్యదర్శి రామాంజనేయులు, మురళీకృష్ణ, విరూపాక్ష గౌడ్, వేణుగోపాల్, కృష్ణమూర్తినాయుడు, సురేష్, ప్రభాగౌడ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఫణిభూషణ్

ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనం పోస్టర్ల ఆవిష్కరణ

అనంతపురం విద్య, ఆగస్టు 4: ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనం పోస్టర్లను ఆ సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఆదివారం ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి రాజారెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక బడా కార్పొరేట్ కంపెనీలకు వేల కోట్ల రుణాలను మాఫీ చేశారన్నారు. దేశ సంపద కొందరు కార్పొరేట్ల చేతుల్లోనే ఉందన్నారు. కష్టజీవులు సంపదను సృష్టిస్తే, కార్పొరేట్ శక్తులు లక్షల కోట్లు కూడబెట్టుకుంటున్నాయని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వెంటనే నిలుపుదల చేయాలన్నారు. తమతో కలసి పోరాటం చేసిన టీడీపీ, జనసేన పార్టీలు ఇప్పుడు బీజేపీతో ఎన్డీఏ కూటమితో అధికారంలో ఉన్నాయన్నారు. ఇప్పుడైనా ఎన్డీఏ ప్రభుత్వం విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలని కోరారు. అదేవిధంగా 44 కార్మిక చట్టాలను తుంగలో తొక్కి...4 లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిన బీజేపీ వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 1, 2, 3 తేదీల్లో విశాఖలో జరిగే జాతీయ సమ్మేళన వేడుకకు కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్, ఉప ప్రధానకార్యదర్శి మల్లికార్జున, కార్యనిర్వాహక అధ్యక్షుడు కృష్ణుడు, గోవిందు, మురుసు శ్రీనివాసులు, ఉప్పు శ్రీనివాసులు, చిరంజీవి, రాజు, వెంకటేష్ పాల్గొన్నారు.


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

నా పేరుతో బెదిరిస్తే సహించను

● ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్

అనంతపురం అర్బన్, ఆగస్టు 4: నా పేరుతో ఎవరు బెదిరింపులకు పాల్పడినా సహించేది లేదని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ హెచ్చరించారు. ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఆయన స్పష్టం చేశారు. నా పేరు చెప్పి ఎవరైనా బెదిరిస్తే భయపడాల్సిన అవసరం లేదని, నేరుగా తనకు తెలియజేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తన బంధువు రేషన్ డీలర్‌ను బెదిరించారలంటూ ఓ పత్రికలో ప్రచురించిన కథనం అవాస్తవమన్నారు. తన బంధువులు ఎవరూ ఇలాంటి పనులు చేయరన్నారు. ఒకవేళ ఎవరైనా తన పేరు, బంధువుల పేరుతో బెదిరిస్తే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఎవరైనా డబ్బు లేదా ఇతర వ్యాపారాల విషయంలో తన పేరు వాడుకుంటే తగిన మూల్యం చెల్లించుకోకతప్పదన్నారు.

మా ప్రభుత్వాన్ని దీవించు స్వామీ..!


శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే దగ్గుపాటి, టీడీపీ నాయకులు

అనంతపురం అర్బన్, ఆగస్టు 4: తెలుగు దేశం ప్రభుత్వంపై వేంకటేశ్వరస్వామి ఆశీస్సులు ఉన్నాయని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. ఆదివారం పలువురు టీడీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే తిరుమలలోని శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి పథంలో నడిచి అంతా మంచి జరగాలని స్వామివారిని కోరుకున్నట్లు తెలిపారు. స్వామి వారి కృపా కటాక్షాలు మా ప్రభుత్వంతోపాటు ప్రజలపై ఉంటాయన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందడంతోపాటు అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించడం ఖాయమన్నారు.

బ్యాడ్మింటన్ పోటీలు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న సభ్యులు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 4: ఇండోర్‌స్టేడియం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో షటిల్ బ్యాడ్మింటన్ ఇంటర్నల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఆసక్తిగా సాగిన పోటీల్లో రైఫర్ రవీంద్రరెడ్డి-శ్రీనివాసరెడ్డి విజేతగా నిలవగా, టీచర్ దేవరకొండ రామాంజనేయులు-కాంట్రాక్టర్ హనుమంతరెడ్డి ద్వితీయ స్థానంలో, పీఈటీ నరసింహారెడ్డి-బాబులు తృతీయ స్థానంలో నిలిచారు. సీఐ విశ్వనాథ్ చౌదరి, రవికాంత్ రమణ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. ఇండోర్‌స్టేడియం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్వైకే శ్రీనివాసులు, సుబ్బారావు, కోశాధికారి రామాంజనేయులు, ఉపాధ్యక్షులు ప్రసాద్, రామకృష్ణారెడ్డి, నరేంద్ర, సహాయ కార్యదర్శులు బాబు, నరసప్ప, శీనా, ధనుంజయనాయుడు, డీఎస్ఏ కోచ్ నరేష్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

ట్యాంకర్లతో తాగునీటి సరఫరా

శింగనమల ఆగస్టు 4: మండలంలోని సి.బండమీదపల్లిలో తాగు నీటి సమస్య పరిష్కారానికి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీనివాసులు తెలిపారు. గ్రామంలో తాగు నీటి సమస్యపై ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ దృష్టికి గ్రామస్థులు తీసుకెళ్లిన సంగతి తెలిసిందే. హైవే రోడ్డు పనులు జరగడం వల్ల పైపులైన్ పగిలిపోవడంతో సమస్యగా మారింది. స్పందించిన ఎమ్మెల్యే ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాలని అధికారులను ఆదేశించారు. స్పందించిన జేఈ రెండు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.


సి.బండమీదపల్లిలో ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న మహిళలు

డీఎస్సీ మెటీరియల్ అందజేత

అనంతపురం విద్య, ఆగస్టు 4: వాల్మీకి ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డీఎస్సీ అభ్యర్థులకు ఉచితంగా డీఎస్సీ మెటీరియల్ అందజేశారు. ఆదివారం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అక్కులప్ప ఆధ్వర్యంలో మెటీరియల్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా రుద్రంపేట బైపాస్ సమీపంలోని వాల్మీకి భవన్‌లో డీఎస్సీ గ్రాండ్ టెస్ట్ నిర్వహించారు. పరీక్షకు 250 మంది హాజరు కాగా పరీక్షలో ప్రతిభ చాటిన 150 మందికి మెటీరియల్ ఉచితంగా అందజేశారు. అక్కులప్ప, జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఇతర వక్తల చేతుల మీదుగా మెటీరియల్ అందజేశారు. రిటైర్డ్ సీఈఓ ఈశ్వర్, ఎంపీపీ వరప్రసాద్, అమరావతి హాస్పిటల్ ఎండీ ముత్యాలన్న, తిమ్మయ్య, వాల్మీకి ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి పవన్‌కుమార్, భాగ్యరాజ్, ఈశ్వర్, శ్రీనివాసులు, రామాంజనేయులు, శంకర్, దాదులూరయ్య పాల్గొన్నారు.

8న సర్పసూక్త హోమం

అనంతపురంరూరల్, ఆగస్టు 4: సర్ప నవగ్రహ దోష పరిహారం నిమిత్తం 8వ తేదీన సర్పసూక్త హోమం, అభిషేక పూజలు నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహకుడు కరణం వెంకట ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని మొదటి రోడ్డు శివాలయంలో ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. సాయంత్రం 4గంటలకు నాగుల నగరోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

ఘనంగా చౌడేశ్వరీదేవి జయంతి

● అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు ● పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు



తాడిపత్రి పట్టణంలోని యల్లనూరు రోడ్డులో ప్రత్యేక అలంకరణలో చౌడమ్మతల్లి



ఉరవకొండలోని చౌడేశ్వరి కాలనీలో ..

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: చౌడేశ్వరీ దేవి జయంత్యుత్సవాల సందర్భంగా అమ్మవారి ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ముఖ్యంగా గుంతకల్లు, ఉరవకొండ, తాడిపత్రి, శింగనమల, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో గల ఆలయాల్లో ఈ పూజలు భక్తిశ్రద్ధలతో జరిపారు. ఈ సందర్భంగా ఆలయాల అర్చకులు వేకువ జామునే అమ్మవారికి సుప్రభాత సేవ చేశారు. తర్వాత పలు అభిషేకాలు చేసి పట్టువస్త్రాలు, వివిధ రకాల పూలతో విశేషంగా అలంకరించారు. అనంతరం అష్టోత్తర నామావళి, ప్రత్యేక పూజలు, కుంకుమార్చన, మహామంగళహారతి, హోమాలు తదితర కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవార్ల దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు పొందారు. పలువురు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆయా ఆలయాల వద్ద సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఉంచి అశేష భక్తజనం మధ్య ఊరేగించారు. రాయదుర్గం పట్టణంలోని నేసేపేటలో గల చౌడేశ్వరిదేవి అమ్మవారిని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించారు.



రాయదుర్గంలో ..



యాడికిలో..



పుట్లూరులో..



కుందుర్పిలో, కూడేరు మండలం గొటుకూరులో చౌడేశ్వరీ దేవి ఉత్సవాలు

ప్రతిభా పురస్కారాలను వినియోగించుకోండి: ఎమ్మెల్యే కాలవ



విద్యార్థినికి బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే

రాయదుర్గం, ఆగస్టు 4: పురస్కారాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు.. విద్యార్థులకు సూచించారు. పట్టణంలో ఆదివారం తొగటవీరక్షత్రియ సంఘం అధ్యక్షుడు సిరిమాలు క్రిష్ణమూర్తి అధ్యక్షతన ప్రతిభ పురస్కారాలు పంపిణీ జరిగింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని, పురస్కారాలను అందించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వ పథకాలతోపాటు కులసంఘాలు అందిస్తున్న ప్రోత్సాహక సహకారాన్ని ఉన్నత విద్యాభ్యాసం కోసం ఉపయోగించుకోవాలన్నారు. ఇంటర్ ప్రథమ ప్రోత్సాహకాన్ని పోలా కస్తూరి, ద్వితీయ ప్రోత్సాహకాన్ని శంకర అన్నపూర్ణ, తృతీయ ప్రోత్సాహకాన్ని గోరంట్ల శ్రీపల్లవిలకు అందించారు. 10వ తరగతిలో ప్రథమ పురస్కారం గట్టు తేజశ్రీ, ద్వితీయ నాగసాయి, తృతీయ భరత్‌కుమార్‌లకు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళు శిల్ప, మాజీ చైర్‌పర్సన్ జ్యోతి, ఎంఈఓ వెంకటరమేష్, మాజీ కౌన్సిలరల్లు వెంకటేశులు, బండి భారతి, పొరాళు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

బలిజ సంఘం ఆధ్వర్యంలో పంపిణీ

గుత్తి: పట్టణంలోని స్పందన ఫంక్షన్ హాల్లో శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘం ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రధానం జరిగింది. ముఖ్యఅతిథిగా ఆ సంఘం కన్వీనర్ దాసరి రాము, టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణ హాజరయ్యారు. బలిజ కులస్థులలో 500 పైబడి మార్కులు తెచ్చుకున్న టెన్త్ విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. వెయ్యి చొప్పున అందజేశారు. అలాగే 6నుంచి 10వ తరగతి చదువుతున్న 140 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలను అందజేశారు. తొలుత శ్రీకృష్ణదేవరాయ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. పలువురు విద్యార్థులు నృత్యాలతో అలరించారు. సంఘం గౌరవాధ్యక్షుడు పీవీ రమణ, అధ్యక్షుడు ఎం రమణ, కార్యదర్శి ఈశ్వరయ్య, నాయకులు పాల్గొన్నారు.

నేడు మంజునాథస్వామి ఆరాధన

బెళుగుప్ప, ఆగస్టు 4: మండల కేంద్రంలో మంజునాథస్వామి 50వ ఆరాధన మహోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు ఆదివారం ప్రకటనలో తెలిపారు. వేకువజామున సుప్రభాత సేవ, 9 గంటలకు మహాగణపతి పూజ, అలాగే మూలవిరాట్‌కు ఏకవార పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు, మహామంగళహారతి కార్యక్రమాలు ఉంటాయన్నారు. సాయంత్రం భజనలు, రథోత్సవం జరుపుతామన్నారు. మంగళవారం మహామంగళహారతితో ఆరాధన మహోత్సవాలు ముగుస్తాయని చెప్పారు.

ఎర్రితాతకు ప్రత్యేక పూజలు

బెళుగుప్ప, ఆగస్టు 4 : ఆషాఢమాస అమావాస్య సందర్భంగా పట్టణంలోని ఎర్రితాత ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. అర్చకులు స్వామి మూలవిరాట్‌కు పలు అభిషేకాలు, అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి దర్శనం చేసుకున్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



నగర వనాన్ని పరిశీలిస్తున్న దేవినేని అవినాష్ చౌదరి

కళ్యాణదుర్గం, ఆగస్టు 4: పట్టణంలో నగరవనాన్ని, అన్నా క్యాంటీన్ పనులను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అల్లుడు దేవినేని అవినాష్ చౌదరి ఆదివారం స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీ లోపు అన్నా క్యాంటీన్ పనులను పూర్తి చేస్తామని తెలిపారు. నగరవనంలో మొక్కలను విరివిగా నాటాలన్నారు. పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే ధ్యేయమన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు చౌళం మల్లికార్జున, మున్సిపల్ మాజీ చైర్మన్ వైపీ రమేష్, మండల కన్వీనర్ గోళ్ల వెంకటేష్, మాజీ ఎంపీపీ అమిలినేని లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

డిస్ట్రిబ్యూటరీకి అడ్డుగా ఉన్న రాళ్ల తొలగింపు

ఉరవకొండ, ఆగస్టు 4: మండలంలోని మోపిడి సమీపంలో హంద్రీనీవా 34వ ప్యాకేజీలోని డీ-2 డిస్ట్రిబ్యూటరీ కాలువకు అడ్డంగా ఉన్న రాళ్లను రైతులు ఆదివారం తొలగించారు. గత ఫిబ్రవరిలో హంద్రీనీవా నీటిని చిత్తూరు జిల్లాకు తరలించేందుకు అధికారులు డిస్ట్రిబ్యూటరీలన్నింటినీ బంద్ చేశారు. కాగా కాలువకు మరో నాలుగు రోజుల్లో నీరు రానుండడంతో జేసీబీ ద్వారా కాలువకు అడ్డంగా ఉన్న మట్టిని, రాళ్లను రైతులు తొలగించారు. అధికారులు పనులు చేపట్టకపోవడంతో రైతులే చందాలు వేసుకుని పనులు చేశారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

పుట్లూరు, ఆగస్టు 4: కడవకల్లులో గ్రామంలోని ఆదినారాయణ అనే వ్యక్తి ఇంట్లో గత నెల 24వ తేదీన చోరీ జరిగిన విషయం విధితమే. ఈ కేసులో నిందితున్ని ఆదివారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ హేమాద్రి తెలిపారు. అదే గ్రామానికి చెందిన నారాయణమూర్తి అనే దొంగ ఇంట్లోకి చొరబడి బీరువాలోని రూ.81వేలు నగదు, బంగారు చోరీ చేశాడన్నారు. ఆ గ్రామ శివారులోనే అతడిని అరెస్ట్‌చేసి రూ.30వేలు నగదు, ఆరు గ్రాముల బంగారు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితున్ని రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

వైసీపీకి మండల కోఆప్షన్ మెంబర్ రాజీనామా

ఉరవకొండ, ఆగస్టు 4: ఉరవకొండకు చెందిన మండల కోఆప్షన్ మెంబర్ పామిడి సలీం వైసీపీకి రాజీనామా చేశారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ మైనార్టీలసమస్యలు పరిష్కరించడంలో పార్టీ విఫలమైందన్నారు. అందుకే రాజీనామా చేస్తున్నానన్నారు. రాజీనామా లేఖను పార్టీ జిల్లా అధ్యక్షుడికి పంపినట్లు తెలిపారు.

జనసేనలోకి 20కుటుంబాల చేరిక



పార్టీలో చేరిన వారితో కదిరి శ్రీకాంత్‌రెడ్డి

తాడిపత్రి, ఆగస్టు 4: పట్టణంలోని జనసేన కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ ఇన్‌చార్జి కదిరి శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో 20కుటుంబాల వారు పార్టీలోకి చేరారు. పెద్దపప్పూరు మండలకేంద్రానికి చెందిన పవన్‌కుమార్, నరసింహులు, శివకుమార్, ఓబులేసు, గౌస్, ఓబులనారాయణ, సాయితోపాటు మరికొంతమంది చేరగా నియోజకవర్గ ఇన్‌చార్జి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

ఉద్యోగిపై దాడి.. కేసు నమోదు

డీ.హీరేహాళ్, ఆగస్టు 4: మండలకేంద్రం సమీపంలో గల ఆపిల్ ఐరన్ ఓర్ ఫ్యాక్టరీలో పలువురు ఉద్యోగులు తోటి ఉద్యోగిపై దాడి చేయడంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. ఫ్యాక్టరీలో ప్రాసెసింగ్ ఇన్‌చార్జి సతీష్, ల్యాబ్ ఇన్‌చార్జి, జేసీబీ ఆపరేటర్ గంగిరెడ్డి నడుమ కొన్ని రోజులుగా పని విషయమై మనస్పర్థలు ఉన్నాయి. ఈ క్రమంలో శనివారం రాత్రి పని ముగించుకుని ఇంటికి వెళుతున్న సతీష్‌పై గంగిరెడ్డి, హనుమంతరెడ్డి మరో ఇద్దరితో కలిసి ఓబుళాపురం చెక్‌పోస్ట్ వద్ద కర్రలతో దాడి చేశారు. దీంతో సతీష్ కుతీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు ఆదివారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నేడు కల్వర్టు ప్రారంభం

కణేకల్లు, ఆగస్టు 4: మండల కేంద్రంలోని చిక్కణ్ణేశ్వర చెరువు వద్ద నూతనంగా నిర్మించిన కల్వర్టు ప్రారంభోత్సవం సోమవారం 10 గంటలకు జరగనుందని, కార్యక్రమానికి ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారని టీడీపీ మండల కన్వీనర్ లాలెప్ప ఆదివారం ప్రకటనలో తెలిపారు. ప్రజలు తరలి రావాలని కోరారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

గుంతకల్లుటౌన్, ఆగస్టు 4: పట్టణంలోని ప్రభుత్వ ఐ టీఐలో 2024-25వ సంవత్సరానికి మూడో విడత కింద ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ఐటీఐ ప్రిన్సిపాల్ సీహెచ్ విద్యాసాగర్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మీ దగ్గరలోని ప్రభుత్వ ఐటీఐలలో ఒరిజినల్ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. ఈనెల 26తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వెరిఫికేషన్ చేయించుకున్న అభ్యర్థులు మాత్రమే ఈనెల 29న కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని ఆయన సూచించారు.

ఇద్దరికి గాయాలు

గుత్తి,ఆగస్టు 4: పట్టణంలోని కర్నూలు రోడ్డులోగల మోడల్ స్కూల్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. ప్యాపిలికి చెందిన మధు, శ్రీనివాసులు ఆదివారం వేరువేరుగా బైక్‌లలో గుత్తికి వచ్చారు. కొద్దిసేపటి అనంతరం తిరిగి ప్యాపిలికి బయలుదేరారు. మోడల్ స్కూల్ సమీపంలోకి వెళ్లగానే ప్రమాదవశాత్తు బైక్‌లు ఢీకొన్నాయి. దీంతో కిందపడి ఇద్దరూ గాయపడ్డారు. స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జేసీపీఆర్ పిలుపుతో శ్రమదానం

యాడికి, ఆగస్టు4: మండలకేంద్రంలోని ప్రభుత్వాస్పత్రి ప్రాంగణంలో ఆదివారం స్థానిక టీడీపీ నాయకులు, లియోక్లబ్ సభ్యులు శ్రమదానం చేసి చెత్తాచెదారం, పిచ్చిమొక్కలను తొలగించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పిలుపు మేరకు ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. అపరిశుభ్ర వాతావరణంలో ఉన్న ఆస్పత్రిలో పాములు, విష పురుగుల సంచారం ఎక్కువగా ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అందుకే చెత్తాచెదారాన్ని, పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రం చేశామని అన్నారు. త్వరలో ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు తిరంపురం నీలకంఠ, ఎస్సీ సెల్ నాయకుడు లక్ష్మణ్, లియోక్లబ్ విశ్వనాథ్, రహంతుల్లా, చాంద్‌బాషా, వెంకటస్వామి, కృష్ణమూర్తి, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

కళ్యాణదుర్గంరూరల్, ఆగస్టు 4: పట్టణంలోని కంబదూరు బైపాస్ రోడ్డులో అక్రమంగా తరలుతున్న రేషన్ బియ్యాన్ని శనివారం అర్ధరాత్రి పోలీసులు పట్టుకున్నారు. కణేకల్లు మండలం నుంచి కర్ణాటక రాష్ట్రానికి బొలెరో వాహనంలో 35 క్వింటాళ్ల రేషన్ బియ్యం అక్రమంగా తరలుతోంది. సమాచారం తెలియడంతో పట్టణ పోలీసులు వెంటనే వెళ్లి కంబదూరు బైపాస్‌రోడ్డులో పట్టుకున్నారు. బియ్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఆదివారం రిమాండ్‌కు తరలించారు.

హనుమాన్ దర్శనానికి ప్రత్యేక బస్సులు

రాయదుర్గంరూరల్, ఆగస్టు 4: హనుమాన్ దర్శనం కోసం ఈ నెల 6వ తేదీ నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డిపో మేనేజర్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. శ్రావణమాసంలోని ప్రతి మంగళ, శనివారాల్లో రాయదుర్గం ఆర్టీసీ డిపో నుంచి మురడి, నేమకల్లు, కసాపురం ఆంజనేయస్వామి ఆలయాలకు బస్సులు నడపనున్నట్లు చెప్పారు. ఎక్స్‌ప్రెస్, అల్ట్రా, డీలక్స్, సూపర్‌లగ్జరీ బస్సులు నడిపిస్తామన్నారు. అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహారాజశ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ / ఆర్బిట్రేటర్, అనంతపురము
డి.ఆర్.ఏ.67/2024

మెస్సర్స్ శ్రీ రామ్ చిట్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్, అనంతపురం బ్రాంచ్-2
-- డిస్‌ప్యూటెంట్
వర్సెస్
యస్.నజిరిన్ మరియు ఇతరులు
- అపోనెంట్స్

అపోనెంట్ 1 మరియు 2 కినోటీసు

1.యస్.నజిరిన్ భర్త:యస్.ఖాదర్ బాషా, వయస్సు: 43 సం॥లు, నివాసం: డో.నెం.: 3/508/3, క్రిష్ణాపురం,1వ రోడ్డు, తాడిపత్రి, అనంతపురం జిల్లా.
2.యస్.ఖాదర్‌బాషా తండ్రి యస్.హసేన్ సాహెబ్ , వయస్సు:47 సం॥లు, వ్యాపారం, నివాసం: డో.నెం: 3/508/3, క్రిష్ణాపురం, 1వరోడ్డు, తాడిపత్రి, అనంతపురం జిల్లా.
డిస్‌ప్యూటెంట్, డిస్‌ప్యూట్ బాకీమొత్తం రూ. 2,48,340/-లు రాబట్టుకొనుటకు గానూ మీపై దాఖలుచేసిన డిస్‌ప్యూట్‌లో 1 మరియు 2కి అపోనెంట్ అయిన మీరు 14-08-2024 తేదీన హాజరు అగుటకు గానూ వాయిదా వున్నది. పైదినం ఉదయం 11.00 గంటలకు డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ O/o ది జిల్లా రిజిస్ట్రార్, డోర్.నెం. 6-3-134, 1వ అంతస్తు, రామ్‌నగర్, అనంతపురము వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపు కోనంతట డిస్‌ప్యూట్ మీ పరోక్షమున తీర్మానించబడును.

By order of Deputy Registrar of Chits
O/of the District Registrar, Registration and Stamps Dept., D.No. 6-3-134, 1st Floor, Ram Nagar, Ananthapuramu

---

మహారాజశ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ / ఆర్బిట్రేటర్, అనంతపురము
డి.ఆర్.ఏ.65/2024

మెస్సర్స్ శ్రీ రామ్ చిట్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్, అనంతపురం బ్రాంచ్-2
-- డిస్‌ప్యూటెంట్
వర్సెస్
పులి దానియల్ మరియు ఇతరులు
- అపోనెంట్స్

అపోనెంట్ 3 కినోటీసు

3.యం.శ్రీనివాసులు తండ్రి: యం.కొమరయ్య, వయస్సు:38సం॥లు, వ్యాపారం , నివాసం: డో.నెం. 16/887-2ఎ, నందలపాడు, తాడిపత్రి, అనంతపురం జిల్లా
డిస్‌ప్యూటెంట్, డిస్‌ప్యూట్ బాకీమొత్తం రూ. 9,90,009/-లు రాబట్టుకొనుటకు గానూ మీపై దాఖలుచేసిన డిస్‌ప్యూట్‌లో 3కి అపోనెంట్ అయిన మీరు 14-08-2024 తేదీన హాజరు అగుటకు గానూ వాయిదా వున్నది. పైదినం ఉదయం 11.00 గంటలకు డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ O/o ది జిల్లా రిజిస్ట్రార్, డోర్.నెం. 6-3-134, 1వ అంతస్తు, రామ్‌నగర్, అనంతపురము వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోనంతట డిస్‌ప్యూట్ మీ పరోక్షమున తీర్మానించబడును.

By order of Deputy Registrar of Chits
O/of the District Registrar, Registration and Stamps Dept., D.No. 6-3-134, 1st Floor, Ram Nagar, Ananthapuramu

---

మహారాజశ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ / ఆర్బిట్రేటర్, అనంతపురము
డి.ఆర్.ఏ.68/2024

మెస్సర్స్ శ్రీ రామ్ చిట్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్, అనంతపురం బ్రాంచ్-2
-- డిస్‌ప్యూటెంట్
వర్సెస్
హెచ్.బాలకృష్ణ మరియు ఇతరులు - అపోనెంట్స్

అపోనెంట్ 4 కినోటీసు

4.ఎ.జగదీష్ తండ్రి: ఎ.నాగభూషణం, వయస్సు: 29సం॥లు. ఉద్యోగి:టెక్నీషియన్-II, ఐయమ్‌పి నెం.24511040212, ఎలక్ట్రికల్ డిపార్టుమెంటు, గుంతకల్, నివాసం: ఆంథోని వీధి, గుంతకల్, అనంతపురం జిల్లా.
డిస్‌ప్యూటెంట్, డిస్‌ప్యూట్ బాకీమొత్తం రూ. 2,89,350/-లు రాబట్టుకొనుటకు గానూ మీపై దాఖలుచేసిన డిస్‌ప్యూట్‌లో 4కి అపోనెంట్ అయిన మీరు 14-08-2024 తేదీన హాజరు అగుటకు గానూ వాయిదా వున్నది. పైదినం ఉదయం 11.00 గంటలకు డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ O/o ది జిల్లా రిజిస్ట్రార్, డోర్.నెం. 6-3-134, 1వ అంతస్తు, రామ్‌నగర్, అనంతపురము వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోనంతట డిస్‌ప్యూట్ మీ పరోక్షమున తీర్మానించబడును.

By order of Deputy Registrar of Chits
O/of the District Registrar, Registration and Stamps Dept., D.No. 6-3-134, 1st Floor, Ram Nagar, Ananthapuramu